ప్రపంచ బ్యాంక్ ఫెలోషిప్

ప్రపంచ బ్యాంక్ ఫెలోషిప్‌నకు తెలంగాణ ఐఏఎస్ అధికారి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ ఎంపికయ్యారు. గణాంకాలు-విశ్లేషణకు సంబంధించిన అంశంపై గతేడాది నుంచి ప్రపంచ బ్యాంక్ ఫెలోషిప్ కోర్స్ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఈ ఫెలోషిప్ కోసం 2600 మంది దరఖాస్తు చేసుకోగా 33 మంది మాత్రమే ఎంపికయ్యారు. భారతదేశం నుంచి ఎంపికైంది కేవలం కృష్ణభాస్కర్ మాత్రమే.

అంతర్జాతీయం

యూఎన్80

- ఐక్యరాజ్య సమితి ప్రారంభించిన కొత్త విధానం ఇది. 80 సంవత్సరాలుగా ఉన్న వివిధ అంతర్జాతీయ సంస్థల పనితీరును మెరుగు పరిచేందుకు ఉద్దేశించింది. లోపాలను సరిదిద్దడం, సాంకేతికతను జోడించడం ఇందులో భాగంగా ఉంటుంది. ఇప్పటిదాకా ఉన్న లక్ష్యాలను ఎంత మేరకు సాధించాయి, విఫలమై ఉంటే కారణాలను తెలుసుకొని సవరిస్తారు.

ఐక్యరాజ్య సమితి కమిషన్

- మహిళల స్థితిగతులపై ఐక్యరాజ్య సమితి కమిషన్ 69వ సమావేశం నిర్వహించారు. దీనిలో కేంద్ర మహిళ-శిశు అభివృద్ధి మంత్రి అన్నపూర్ణ దేవి పాల్గొన్నారు. లింగ సమానత్వంతో పాటు మహిళల విద్య, భద్రతా ప్రమాణాలు భారత్ అమలు చేస్తున్న పథకాలను సమావేశంలో ఆమె వివరించారు.

కనీస పోషణ భన్నత్వం

- కనీస పోషణ భిన్నత్వం అనే కొత్త సూచికను ఐక్యరాజ్య సమితి గణాంక కమిషన్ ప్రారంభించింది. ఇందులో బాలలు, మహిళలు అనే రెండు విభాగాలుంటాయి.

సూచికను తయారు చేసే సమయంలో బాలలు, మహిళలు గడిచిన 24 గంటల్లో ఏం ఆహారం తీసుకున్నారన్న అంశాన్ని ప్రశ్నించి ఈ సూచికను రూపొందిస్తారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ

- వైద్య సంరక్షణ, పరిపాలనలో కృత్రిమ మేధను వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది. ఇందుకు నెదర్లాండ్స్‌కు చెందిన డెల్ఫ్ట్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సాంకేతికతతో పాటు కృత్రిమ మేధ వినియోగంలో నైతిక విలువలను కూడా పాటించేలా పరిశోధన చేయనున్నారు.

అచితిన్న పార్క్

- ప్రపంచంలోనే అతిచిన్న పార్క్ జపాన్‌లో ఉంది. కేవలం 2.6 చదరపు అడుగులు మాత్రమే ఇది ఉంది. ఆ దేశంలోని నగైజుమిలో ఈ పార్క్ ఉంది.

అర్మేనియా

- భారతదేశం నుంచి ఆయుధాలు ఎగుమతి అతి ఎక్కువ కలిగిన అర్మేనియా తాజాగా వైద్య ఉత్పత్తుల నియంత్రణకు సంబంధించి ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

మహాసాగర్

- 'మహాసాగర్' అనే కొత్త విధానంతో పాటు వాజ్‌పేయి పేరుమీద ఏర్పాటు చేసిన విద్యా వ్యవస్థను ప్రధాని మోదీ మారిషస్‌లో ప్రారంభించారు. ఇరుదేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక స్థాయికి పెంచుకున్నాయి. ప్రధాని మోదీ మారిషస్‌లో మార్చి 11, 12 తేదీల్లో పర్యటించారు. ఎంఏహెచ్ ఏఎస్ఏజీఏఆర్ పూర్తి రూపం మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ అక్రాస్ రీజియన్స్. అలాగే భారత్, మారిషస్ వివిధ అంశాల్లో ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. అవి స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, ఎస్‌బీఐ ద్వారా రుణ సదుపాయం, ఎంఎంఎంఈ రంగం లో సహకారం, అంతర్గత వాణిజ్యం, పరిపాలన సంస్కరణలు తదితర రంగాల్లో ఇరు దేశాలు పరస్పరం సహకరించుకోనున్నాయి. మారిషస్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

లిథువేనియా

- క్లస్టర్ మ్యూనిషన్స్ అనే ఆయుధాలకు సంబంధించిన ఒప్పందం నుంచి లిథువేనియా నిష్క్రమించింది. ఈ ఒప్పందం నుంచి వైదొలిగిన తొలి దేశం ఇదే.

అమెరికా

- పర్యావరణ మార్పు, విపత్తుల మూలంగా నష్టపోయిన దేశాలకు ఆర్థిక సాయం ఇచ్చేందుకు కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ 27వ సదస్సులో ఏర్పాటు చేసిన లాస్ అండ్ డ్యామేజీ ఫండ్ నుంచి అమెరికా వైదొలిగింది.

బార్బడోస్

- ప్రధాని మోదీకి బార్బడోస్ దేశ అత్యున్నత పురస్కారాన్ని అందించింది. మోదీ నాయకత్వ లక్షణాలకు ఈ అవార్డ్ ఇచ్చినట్లు ప్రకటించారు.

వార్తల్లో వ్యక్తులు

మాంటెనిగ్రో

- పోర్చుగీస్ ప్రధాన మంత్రి మాంటెనిగ్రో విశ్వాస పరీక్షలో ఓడిపోవడంతో తన పదవికి రాజీనామా చేశారు.

అతుల్ కుమార్ గోయల్

- ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కు కొత్త కార్యనిర్వాహక అధికారిగా అతుల్ కుమార్ గోయల్ బాధ్యతలను స్వీకరించారు.

జోయ్‌మాల్య బాగ్చి

- సుప్రీంకోర్ట్ న్యాయమూర్తిగా జోయ్ మాల్య బాగ్చిని రాష్ట్రపతి నియమించారు. అంతకుముందు ఆయన కోల్‌కతా హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు.

మార్క్ కార్నీ

- కెనడా నూతన ప్రధాన మంత్రిగా మార్క్ కార్నీ నియమితులయ్యారు.

వికాస్ కౌశల్

- హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వికాస్ కౌశల్ నియమితులయ్యారు.

తెలంగాణ

యాదగిరిగుట్టకు సర్టిఫికేషన్

- యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి ఆధ్యాత్మిక సేవల్లో అత్యుత్తమ ప్రతిభ చూపినందుకు ఐఎస్‌వో 9001:2016 సర్టిఫికేషన్ పొందింది.



ఫ్యూచర్ సిటీ

- ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో కొత్త సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలతో దీని పరిధిని నిర్ణయించింది. ఈ అథారిటీకి ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ముఖ్యంగా శ్రీశైలం జాతీయ రహదారి-నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారికి మధ్య ఉన్న ప్రాంతాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకొచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇది విస్తరించి ఉంది.

రాజీవ్ యువ వికాసం

- రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు రూ. 6 వేల కోట్లు ఇవ్వనున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు ఆర్థిక సాయం అందనుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తారు.

గురుకులాలకు నిధులు

- యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు

రూ. 11 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 55 నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనున్నారు. ఒక్కోదానికి రూ. 200 కోట్ల చొప్పున కేటాయించారు. ఒక్కో గురుకులం 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తారు. ఇందులో 2560 మంది చదువుకునేందుకు వీలుంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ, ఇలా అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోవచ్చు. ప్రతి పాఠశాలలో 120 మంది చొప్పున ఉపాధ్యాయులను నియమిస్తారు. సమీకృత గురుకులానికి పరిపాలన భవనం ప్రత్యేకంగా ఉంటుంది. వీటిని నిర్మించే ప్రాంతాల్లో 25 సంవత్సరాల నుంచి అక్కడి ఉష్ణోగ్రతలు, వర్షపాతం, చలి, వేడిగాలుల తీవ్రత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

గిరిజన విశ్వవిద్యాలయం

- సమ్మక్క-సారక్క గిరిజన విశ్వవిద్యాలయానికి తొలి ఉపకులపతిగా ప్రొ. యడవల్లి లక్ష్మీ శ్రీనివాస్‌ను కేంద్రం నియమించింది. ఐదేళ్లు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

టీహబ్

- హైదరాబాద్‌లోని ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రం కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కవికృత్ నియమితులయ్యారు.

ఎమ్మెల్సీల ఎన్నిక

- ఎమ్మెల్యేల కోటాలో ఐదుగురు ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవమైంది. నామినేషన్లు వేసిన అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయ శాంతి, నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రోజులు-ప్రాధాన్యం

మార్చి 4

- ఏటా మార్చి 4న జాతీయ భద్రత రోజు నిర్వహిస్తారు. అలాగే మార్చి 4 నుంచి 10 వరకు జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తారు. విధుల్లో భాగంగా ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పిస్తారు.

మార్చి 10

- ఏటా మార్చి 10న అంతర్జాతీయ మహిళా న్యాయమూర్తుల రోజుగా నిర్వహిస్తారు. న్యాయ రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించింది ఈ రోజు.

జాతీయం

నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా

- ఢిల్లీ కేంద్రంగా పనిచేసే నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా 135వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించింది. 1891, మార్చి 11న ఈ సంస్థను ఏర్పాటు చేశారు. భారత సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, సాహిత్యం తదితరాలను పరిరక్షిస్తారు. ఈ సందర్భంగా భారత శిల్ప కళ, విజ్ఞానానికి సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహించింది.

'స్థానిక' మహిళ ప్రతినిధుల సాధికారత

- స్థానిక సంస్థల్లో వివిధ హోదాల్లో మహిళలు ఎన్నికయినా వారి బదులు వారి సమీప బంధువులు అధికారం చెలాయిస్తున్నారని ప్రభుత్వం నియమించిన కమిటీ ఇటీవల నివేదిక ఇవ్వడంతో కేంద్రం అప్రమత్తమైంది. ఈ విధానానికి స్వస్తి పలికేందుకు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. డిజిటల్ పద్ధతిలో దీన్ని కొనసాగిస్తుంది. 'అస్లీ ప్రధాన్ కౌన్', 'సశక్తి పంచాయత్ నేత్రి అభియాన్' వంటి పేర్లతో అవగాహనను కల్పిస్తుంది. మహిళల సామర్థ్యాన్ని పెంచేందుకు పలు శిక్షణలను కూడా ఈ ప్రచారంలో భాగం చేసింది.

అమృత్ జీవ వైవిధ్య పార్క్

- ఢిల్లీలో కామన్‌వెల్త్ క్రీడల గ్రామానికి సమీపంలో అమృత్ జీవ వైవిధ్య పార్క్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రారంభించారు. 115 హెక్టార్ల విస్తీర్ణంలో ఇది ఉంది. భారత జాతీయ ఉద్యమం ఇతివృత్తంగా ఈ పార్క్‌ను అందుబాటులోకి తెచ్చారు. అందుకే ఇక్కడి ట్రాక్‌లకు 'సంతాల్ తిరుగుబాటు, చంపారన్ సత్యగ్రహం, దండి మార్చ్, ఆజాద్ హింద్ ఫౌజ్' అని పేర్లు పెట్టారు.

58వ పులుల రిజర్వ్

- మధ్యప్రదేశ్‌లోని మాధవ్ జాతీయ పార్క్‌ను పులుల రిజర్వ్‌గా ప్రకటించారు. దీంతో దేశంలో పులుల రిజర్వ్‌ల సంఖ్య 58కి చేరింది. మధ్యప్రదేశ్‌లో ఇది తొమ్మిదోది.

అస్సాంశాట్

- అసోం రాష్ట్ర సామాజిక-ఆర్థిక అభివృద్ధికి సొంతంగా ఉపగ్రహాన్ని ప్రయోగించాలని ఆ రాష్ట్రం నిర్ణయించింది. అస్సాంశాట్ పేరుతో దీన్ని ప్రయోగించనున్నారు. అలాగే దేశంలో తొలిసారి యాంటీ డీప్ ఫేక్, సైబర్ సర్వీలెన్స్ ల్యాబ్, తొలి గ్రీన్ ప్యాకింగ్ పారిశ్రామిక హబ్, వెదురుతో తొలి స్మార్ట్ సిటీ, తేయాకు వేలానికి తొలిసారి ఏఐ, బ్లాక్‌చెయిన్ సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించింది.

తమిళ నాడు రూపాయి గుర్తు

- భారత రూపాయి గుర్తు స్థానంలోనే తమిళ నాడు రాష్ట్రం తమిళ భాషకు సంబంధించిన గుర్తును వినియోగిస్తుంది. ఇటీవల ఆ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త గుర్తును ముద్రించింది.

మన్మోహన్ సింగ్ యూనివర్సిటీ

- బెంగళూర్ సిటీ యూనివర్సిటీ పేరు మార్చారు. ఇకనుంచి దీన్ని డాక్టర్ మన్మోహన్ సింగ్ యూనివర్సిటీగా పిలవనున్నారు.

మహిళా సమృద్ధి యోజన

- మహిళా సమృద్ధి యోజన అనే పథకాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వనున్నారు. 18-60 సంవత్సరాల మధ్య ఉన్న మహిళలు ఈ ప్రయోజనానికి అర్హులు. పథకం అమలుకు రూ. 5100 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించారు.

ఆర్థిక అక్షరాస్యత

- జాతీయ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై ఆర్‌బీఐ, జాతీయ ఆర్థిక విద్యా కేంద్రాలు ప్రచారాన్ని ప్రారంభించాయి. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసున్న వాళ్లకు ఈ పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి.

వ్యవసాయ నియమావళి

- వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినియోగించడం, సుస్థిరాభివృద్ధి సాధించడంతో పాటు ఉత్పాదకతను పెంచేందుకు ఒక నియమావళి రూపొందించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నియమావళిని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రూపొందించనుంది.

బాహుబలి గుజియా

- ఉత్తరప్రదేశ్ లక్నోలోని చప్పన్ భోగ్ అనే స్వీట్ షాప్ అతిపెద్ద స్వీట్‌ను తయారు చేయడం ద్వారా గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించింది. ఇది ఆరు కేజీల బరువు ఉంది. దీనికి బాహుబలి గుజియా అని పేరు పెట్టారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411